క్లుప్తంగా

ఘనంగా కాలాష్టమి వేడుక



పూజల్లో పాల్గొన్న భక్తులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని శ్రీ కాలభైరవపురం (ఎంఎస్ కొట్టాల)లోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి దేవస్థానంలో మంగళవారం కాలాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం, అష్టోత్తరం, కుష్మాండ దీప సేవారాధన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న వినోద్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపకు చెందిన వినోద్ కుమార్, బండి సంధ్యలు మంగళవారం కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. తమ కుమారుడు కాసాని విశాంక్ సాయి జన్మ దినాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలోని వారికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన ఉదయ్‌భాస్కర్, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

చలానా చెల్లించేందుకు గడువు పెంపు

కడప కార్పొరేషన్ : దీపావళి సందర్భంగా టపాసుల అంగళ్లు నిర్వహించాలనుకునేవారు చలానా చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టపాసుల విక్రయదారుల అభ్యర్థన మేరకు ఈనెల 15వ తేదీ వరకూ గడువు పొడిగించామన్నారు. 15వ తేదీ సాయంత్రంలోగా రూ.10వేలు చెల్లించాలన్నారు. రుసుము చెల్లించిన దరఖాస్తు దారులకు మాత్రమే లాటరీలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని, ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహించాలని పీఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెల్లూరు శంకర్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని పిఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల, పేద వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, జిల్లా నాయకులు జగదీశ్, యశ్వంత్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సరఫరా పంపిణీ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మిక సమస్యలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వం జోక్యం చేసుకొని చర్చలు జరిపి వారి న్యాయమైన కోరికలు హక్కులు నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ఉద్యోగులు కార్మికులు గత ఆరు నెలల నుండి వివిధ రూపాల్లో ప్రభుత్వానికి విన్నవించిన సమ్మె నోటీసులు ఇచ్చిన ప్రత్యక్ష పోరాటాలు చేసిన విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరించడం సమంజసం కాదని మండిపడ్డారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి సమస్యలు పరిష్కరించాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కడపలోని ఆర్జేయూపీ టీచర్స్ భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీలో అన్ని ఖాళీలు భర్తీ కాకపోవడంతో బదిలీ పొందిన టీచర్లు రిలీవ్ కాని పరిస్థితి వచ్చిందని ఆవేదనను వ్యక్తం చేశారు. వీరి ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళరెడ్డి, మహిళా కార్యదర్శి అనసూయమ్మ పాల్గొన్నారు.

నేడు హాజరుకావాలి

కడప కోటిరెడ్డి సర్కిల్: టపాసుల దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు బుధవారం సాయంత్రం 6 గంటలకు కడప ఆర్డీఓ కార్యాలయంలో హాజరుకావాలని కడప తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. టపాసుల దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నవారికి లాటరీ ద్వారా కేటాయిస్తామన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ దళిత వ్యతిరేక పార్టీలు



సమావేశానికి హాజరైన ఎస్సీసెల్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగాన్ని బలోపేతం చేయాలి
- డివిజన్ల వారీగా కమిటీలు పూర్తి చేయాలి
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : టీడీపీ, జనసేన, బీజేపీ దళిత వ్యతిరేక పార్టీలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తెలిపారు. మంగళవారం మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో కడప నియోజకవర్గ ఎస్సీ విభాగం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కమిటీ, కడప నియోజకవర్గ కమిటీతో పాటు 50 డివిజన్లకు కూడా కమిటీలు నియమించాలన్నారు. జిల్లా కమిటీ, కడప నియోజకవర్గ కమిటీలో మరికొంతమందిని తీసుకోవాలన్నారు. ఈ కమిటీలను పూర్తి చేయడానికి ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జులు చొరవ తీసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఒరిగిందేమీ లేదన్నారు. అణగారిన వర్గాలకు ఈ ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే ఆయా వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. నామినేటెడ్ పనుల్లో, పదవుల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని సీఎం చంద్రబాబు దళితులను అవమానించారని, దళితులు శుభ్రంగా ఉండరు, చదువుకోరు అని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన దళిత వ్యతిరేక పార్టీలని తెలిపారు. వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో అంబేడ్కర్ ఆశయాల మేరకు పాలన సాగించారని, దళిత, గిరిజన, బహుజన, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి కీలక మంత్రి పదవులు ఆయా వర్గాలకు ఇచ్చారని గుర్తు చేశారు. టీడీపీ వారిని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుందే తప్పా ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. కూటమి అమలు చేస్తున్న పథకాల వల్ల కూడా దళితులకు ఒరిగిందేమీ లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం వచ్చాక దళితులపై దాడులు ఎక్కువయ్యాయని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాలన్నీ దళితులకు వివరించాలని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, దళిత వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. తద్వారా వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మెన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి త్యాగరాజు, మాజీ ఎస్సీసెల్ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, కార్పొరేటర్ చెన్నయ్య, కోఆప్షన్ సభ్యురాలు బి. మరియలు, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానసికంగా బలంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మానసిక వైద్యులు డాక్టర్ హరిత

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు శారీరక దృఢత్వంతోపాటు మానసిక దృఢత్వం ఎంతో అవసరం అని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హరిత పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరం అన్నారు. మానసిక ఆరోగ్యం ఉంటేనే చదువుపై శ్రద్ధ ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అందుకోసం తగిన మానసిక పరిపక్వత, ప్రశాంతత పొందడం ద్వారా విద్యార్థులు సక్రమంగా ఆలోచించే స్థాయికి తీసుకరావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కళాశాల చైర్మెన్ బి. శ్రీనివాసులు, స్టెప్ ఆఫీసు సీఈఓ విజయ్‌కుమార్, మేనేజర్ సుబ్బరాయుడు, ఐబిసి ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

16న గాంధీ విగ్రహం వద్ద నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈనెల 16వ తేదీన కర్నూలు పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగంలో కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలని, రాయలసీమకు రూ.20 వేల కోట్ల ప్యాకేజీ కేటాయించాలని డిమాండ్ చేస్తూ కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద సీపీఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ మోహన్ తెలిపారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి గతంలో మూడుసార్లు వచ్చారని, ఇప్పుడు మళ్ళీ నాలుగోసారి వస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు. రాయలసీమలో బీజేపీకి ఇద్దరు శాసనసభ్యులు ఉన్నా రాయలసీమ ప్రాంత ప్రజల ప్రయోజనాలను కాపాడడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఐటీఐ సర్కిల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జ్ఞాన సంపన్నులుగా తయారు కావాలి



విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశలో నైపుణ్యత ఆర్జించి సమాజానికి ఉపయోగపడే ప్రభావవంతమైన మానవవనరుగా, విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలను మోసే రాయబారిగా నిలవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం సాయంత్రం ఆయన విశ్వవిద్యాలయ విద్యార్థులతో అన్నమాచార్య సెనెట్ హాల్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని తప్పక పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి మీ సలహాలు కూడా స్వీకరిస్తానన్నారు. విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ ప్రగతికి మీ సహకారం అవసరమన్నారు. ఈ సమావేశంలో వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టిశ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ కృష్ణకిషోర్

కడప ఎడ్యుకేషన్ : మత్తుకు అలవాటు పడి కొంతమంది యువత భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకుంటుందని, సమాజం లోని ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలను దూరంగా ఉండాలని ఏడీ కృష్ణకిషోర్ సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవాం 'ఈగల్' టీం ఆధ్వర్యంలో కడప నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో యాంటి డ్రగ్స్ అవేర్ నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ కొంతమంది డబ్బుల కోసం నేరాలు, హత్యలకు సైతం పాల్పడుతూ, మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలల సమీప ప్రాంతాలలో కానీ మీరు నివసించే చుట్టుపక్కల ప్రాంతాలలో కానీ ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడ్డట్లు గుర్తించినా లేదా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌సిసి ఏఎస్ఐ మల్లయ్య, అధ్యాపకులు, పాలిటెక్నిక్ విద్యార్థినులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, అనంతరం అమ్మవారికి విశేష అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం నిర్వహించిన రాహుకాల పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

కడప సెవెన్‌రోడ్స్ : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడపజిల్లాశాఖ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగామ్ అసిస్టెంట్ డాక్టర్ టి.గోపిబాబు తెలిపారు. నవంబరు 30వ తేది ఉదయం 9.00 గంటల నుంచి కడప హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఒక విభాగంగా శ్రీమద్ భగవద్గీత 14వ అధ్యాయం గుణత్రయ విభాగ యోగంపై పోటీలు ఉంటాయన్నారు. 10 నుంచి ఇంటర్మీడియేట్ వరకు విద్యార్థులకు 16వ అధ్యాయం దైవాసుర సంపద్ విభాగ యోగంపై పోటీలు ఉంటాయన్నారు. అలాగే 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు వారికి నిత్య జీవితంలో భగవద్గీత భావ విశ్లేషణ అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. ప్రతి విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. కనుక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు 91107 79066 నెంబరులో సంప్రదించాలన్నారు.

బదిలీ టీచర్లను రిలీవ్ చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఇటీవల నిర్వహించిన బదిలీలలో రిలీవర్ లేక అక్కడే ఉన్న ఉపాధ్యాయులను రిలీవ్ చేసి వారు బదిలీ పొందిన స్థానాలకు పంపాలని ఎస్‌టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి నాగేంద్ర, వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళి ఉన్నారు.

యాదవ భవన్ కోసం స్థలం కేటాయించాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలో యాదవ భవన్ నిర్మాణం కోసం వెంటనే స్థలాన్ని కేటాయించాలని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి.నారాయణయాదవ్ జాయింట్ కలెక్టర్‌ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 83 సెంట్ల స్థలాన్ని పుట్లంపల్లె గ్రామ సర్వే నెంబరు 155-1, 154-1లో కేటాయించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. దీనిపై తహసీల్దార్, ఆర్డీఓలు కలెక్టర్‌కు నివేదిక సైతం సమర్పించారన్నారు. అయితే ఇంతవరకు కలెక్టర్ నుంచి స్థల కేటాయింపునకు సంబంధించిన ఆదేశాలు జారీ కాలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే స్థలాన్ని యాదవ భవన్ నిర్మాణానికి అప్పగించాలని కోరారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఇర్షాద్ అహ్మద్

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని, అలాంటి వృత్తిలోకి నూతనంగా వస్తున్న ఉపాధ్యాయులందరికీ ఒక గొప్ప అవకాశమని, ప్రభుత్వ పాఠశాలలలో ఎక్కువగా పేద విద్యార్థులు ఉంటారని, వాళ్లకు భవిష్యత్తు అందించే విధంగా విద్యాభ్యాసం ఉండాలని కడప మండల విద్యాశాఖ అధికారులు రఫీక్ అహ్మద్, ఇర్షాద్ అహ్మద్ లు సూచించారు.

కడప మండల పరిధిలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు మంగళవారం కడప ఎమ్మార్సీలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయపాలన అనేది చాలా ప్రధానమైన బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయ సంఘం నాయకులు, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి టైలరింగ్ (31 రోజులు), బ్యూటీ పార్లర్ (35 రోజులు), ఎంబ్రాయిడరీ(31 రోజులు)లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సుగల మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని, దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బహుమతులు పొందిన విద్యార్థినిలతో అతిథులు, ఎల్ఐసీ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా, బేటి బచావో, బేటీ పడావో వంటి పథకాల ద్వారా యువతులను ప్రోత్సహిస్తోందని, వీటిని యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఆర్ట్స్ కాలేజీలో ఎల్ఐసీ శ్రామిక మహిళా విభాగం, మహిళా సాధికార విభాగం నిర్వహించిన వక్తృత్వ పోటీలను ఆయన ప్రారంభించారు. డాక్టర్ సులోచన, డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ ఒక మహిళ ఎదిగితే ఒక తరం ఎదుగుతుందని అన్నారు. ఎల్ఐసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి, మహిళా కన్వీనర్ వసుప్రద మాట్లాడుతూ ఏఐఐఇఏ ప్లాటినం జూబ్లీలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఈ నెల 18న కడపలో జరిగే శ్రామిక మహిళా సదస్సులో బహుమతులు అందజేస్తామన్నారు. 'చదువుకున్న యువతుల ముందున్న అవకాశాలు- సవాళ్లు' అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీలో సయ్యద్ తహసీన్, ఖుషి మహమ్మద్, సాలిక మొదటి మూడు స్థానాలు సాధించగా, సమీనా, మహేశ్వరీ, భాగ్యలక్ష్మి కన్సోలేషన్ బహుమతులు పొందారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కూటమి ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, నాగ సుబ్బారెడ్డి, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మలు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తక్షణం ఆశా కార్యకర్తలకు మెరుగైన వేతనాలు ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, సంక్షేమ పథకాలు అన్ని వర్తింప చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సర్వీసులో మరణించిన ఆశాలకు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇవ్వాలని, మరణించిన ఆశా కుటుంబంలో కుమార్తెకు లేదా కోడలుకు ఒకరికి తక్షణం ఆశా ఉద్యోగం ఇవ్వాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి బాదుల్లా, కమలాపురం నియోజకవర్గ కార్యదర్శి పి చంద్రశేఖర్, నగర అధ్యక్షులు పిచ్చినేని సుబ్బరాయుడు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి శాంతమ్మ, ఉపాధ్యక్షులు అనసూయ, కోశాధికారి అమ్ములు, నగర అధ్యక్షురాలు ఏ. ఎల్ .నరసమ్మ, జిల్లా నాయకురాళ్లు డోరతి, మంజుల, విజయశాంతి, నారాయణమ్మ, సుధారాణి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైవీయూను అగ్రగామిగా నిలపాలి



వీసీని సత్కరిస్తున్న ప్రైవేట్ డీగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు



వీసీకి మిఠాయి తినిపిస్తున్న వైవీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయాన్ని అగ్రస్థానంలో ఉండేలా అభివృద్ధి చేయాలని నూతన వీసీగా నియమితులైన బెల్లంకొండ రాజశేఖర్‌ను ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు కోరారు. వీసీని ఆయన మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో అభినందించారు. వైవీయూ అభివృద్ధి కోసం ఆర్ఎస్ఎఫ్ చేస్తున్న పోరాటం గురించి వివరంచారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- యోగివేమన విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిబాటలో నడిపించేందుకు కృషి చేయాలని వీసీ బెల్లంకొండ రాజశేఖర్‌ను వైవీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లం రాజశేఖర్‌రెడ్డి కోరారు. వైవీయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన బెల్లంకొండ రాజశేఖర్‌ను నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు, సంఘ సభ్యులు కలిసి హృదయపూర్వక అభినందనలు తెలియ చేశారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాలల అభివృద్ధికి సహకరించాలి..

జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల అభివృద్ధికి సహకరించాలని వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్‌ను ప్రైవేట్ డీగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం వారు మర్యాదపూర్వకంగా వీసీని కలిసి శుభాకాంక్షలు తెలియచేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరమణ, సెక్రటరీ శ్రీనివాసులు, అసోసియేషన్ జిల్లా నాయకులు సుబ్బా రెడ్డి, మేధా నరసింహులు, జయ ప్రకాష్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, సంజీవ రెడ్డి, రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సలీంబాషా

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాని సాధన కోసం కృషి చేయాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష సూచించారు. ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ కళాశాలలో మంగళవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలోని వివిధ విభాగాలు, హాస్టల్ సదుపాయాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వంటి సేవా కార్యక్రమాల గురించి వివరించారు. విద్యార్థులు కాలేజీలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని దాన్ని వెలికి తీయాలన్నదే మా లక్ష్యమన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, నైపుణ్యాలు, కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు సాధించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. పి. గురివిరెడ్డి, ఎస్ఐపి కోఆర్డినేటర్ డా. కె. నారాయణ రెడ్డి విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సందేశం ఇచ్చారు.

